క్లుప్తంగా...

సిటీ కళాశాలలో మూడు కొత్త డిగ్రీ కోర్సులు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి మూడు నూతన డిగ్రీ కోర్సులను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యా కమిషనరేట్ నుండి అందిన సమాచారం ప్రకారం కంప్యూటర్ సైన్స్‌లో 3–సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ, 4 సంవత్సరాల ఆనర్స్ బయోటెక్నాలజీ కోర్సు, టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో 3 సంవత్సరాల బీబీఏ కోర్సులకు అనుమతులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ (ఆనర్స్) కోర్సు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌తో సమానమన్నారు.

నియామకం


వెంకటేశ్వర్లు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ పెయింటింగ్ విభాగానికి అసిస్టెంట్‌గా ప్రొఫెసర్ జే.వెంకటేశ్వర్లు (అడ్‌హాక్) నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ టి.గంగాధర్, నియామక ఉత్తర్వులు అందజేశారు. వెంకటేశ్వర్లు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెయింటింగ్ విభాగం విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన శిక్షణను ఇచ్చి వారు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు పొందడానికి కృషి చేస్తానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి టోర్నమెంట్ ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ)లోని వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పాల జ్యోతి రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలోని ట్విట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్, మోటార్ మెకానిక్ తదితర ట్రేడులలో చేరాలనుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు 8వ, 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రభుత్వ నియమ నిబంధనలు, రిజర్వేషన్లను అనుసరించి ప్రవేశాల ప్రక్రియ ఉంటుందన్నారు. వివరాలకు విజయనగర్‌కాలనీలోని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో, వెబ్‌సైట్ https://iti.telangana.gov.inలో సంప్రదించవచ్చు.

చార్మినార్‌ను సందర్శించిన యూఎస్ అంబాసిడర్



చార్మినార్: చార్మినార్ కట్టడాన్ని శనివారం భారత్‌లోని యూఎస్ అంబాసిడర్ ఎరిక్ మైఖేల్ గార్సెట్టీ సందర్శించారు. కట్టడంపైకి ఎక్కిన ఆయన హైదరాబాద్ నగర అందాలను తిలకించారు. నగరంతో పాటు చార్మినార్ కట్టడం విశేషాలను సంబంధిత ఆర్కియాలజీ సిబ్బంది ఆయనకు వివరించారు. అనంతరం చార్మినార్ రిజిస్టార్‌లో ఎక్సలెంట్ అని తన అభిప్రాయాన్ని పొందుపరిచారు.

సుశీలకు ఆత్మీయ సత్కారం


సుశీలను సన్మానిస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకుని ప్రవాస భారతీయులు శ్రీనివాస్ చిమట, సుంకర శ్రీరామ్ సౌజన్యంతో బృందావనం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గాయని సుశీలకు శనివారం రవీంద్రభారతిలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. స్వరాభిషేకం పేరిట గాయని గాయకులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ది బోస్టాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ సుబ్బు కోట, సినీనటుడు వడ్డి నాగమహేష్, ఆప్తా వ్యవస్థాపకులు శ్రీనివాస్ చందు, సభ్యులు వత్తిపాటి వీరబాబు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విద్యుత్ అధికారుల వేధింపులంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ

దూద్‌బౌలి: ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. సిప్లిగంజ్‌కి చెందిన రాము (40) పెయింటింగ్ వేస్తుంటాడు. శుక్రవారం రాము పనులు ముగించుకొని ఇంటికొచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుమారుడు, భార్య, పోలీసులకు సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. డబ్బులు లేకపోవడంతో అద్దెకుంటున్న తమను రూ.6 వేల కరెంటు బిల్లు కట్టని కారణంగా రామును విద్యుత్ అధికారులు వేధించడంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాని భార్య స్వరూప, కుమారుడు ఆరోపించారు. ఎలాంటి నోటీసులు లేకుండా విద్యుత్ తొలగిస్తున్నారని రాము విషయంలో వేధింపులే కారణమని బస్తీవాసులు సైతం ఆరోపిస్తున్నారు.

బోనాల జాతర సందడి షురూ..

- జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో పాతబస్తీలో ముగిసిన పర్యటన
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఉత్సవాల నిర్వాహకులు
- ఈసారి కూడా సప్త మాత్రుకలకు బంగారు బోనం
- గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ఉత్సవాలు ప్రారంభం

ఇప్పటికే మంత్రి తలసాని అధ్యక్షతన ఉన్నతాధికారుల సమావేశం


బంగారు బోనం (ఫైల్)


బోనాల జాతరలో పోతరాజుల నృత్యాలు (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందడి మొదలైంది. బోనాల జాతర ఉత్సవాల నిర్వాహణ, ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై ఇప్పటికే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం జరిగింది. జూన్ 22న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు పాత్రలోని నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాల పూజా కార్యక్రమాలతో పాతబస్తీలో ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈసారి పాతబస్తీలో జరిగే బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించడానికి ఉత్సవాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

- ఇప్పటికే భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.
- అంతేకాకుండా జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో పాతబస్తీలో సంబంధిత అధికారులతో కలిసి ఇప్పటికే పర్యటించారు.
- ఈఏడాది బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించడానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన పలు దేవాలయాలను సందర్శించి సమీక్షించారు.

నిజాం కాలం నుంచి..

- నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారి ఆలయాలలో పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన బోనంను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.
- తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే విధంగా పాత నగరంలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు కనుల పండువగా జరుగుతాయి.
- తెలంగాణ జిల్లాలలోనే అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు పాతబస్తీకి ప్రత్యేకతను చాటుతాయి.

పాతబస్తీలో ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర వివరాలిలా..



- ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు జూన్ 22న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ప్రారంభమవుతాయి.
- 27న బల్కంపేట ఎల్లమ్మ తల్లికి బంగారు బోనం
- 30న, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు పాత్రలో బోనం
- జులై 2న విజయవాడ కనక దుర్గా అమ్మవారికి ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. బంగారు పాత్రలో అమ్మవారికి బోనం, పట్టువస్త్రాలు, వడిబియ్యం సమర్పించనున్నారు.
- జులై 6న, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం.
- 7న, పాతబస్తీలోని అన్ని అమ్మవారి ఆలయాలలో కలశస్థాపనతో పాటు ధ్వజారోహన.
- 9న, పాతబస్తీలో అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు కొనసాగుతుంది.
- శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ఊరేగింపు బయలు దేరుతుంది.
- లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారు.
- జులై 11న, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం, పట్టువస్త్రాల సమర్పణ.
- జులై 13న లాల్‌దర్వాజ సింహవాహిణి అమ్మవారికి బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నారు.
- జులై 16న హైదరాబాద్ నగరంతో పాటు పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.
- అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం 17న పాతబస్తీలో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కొనసాగుతుంది.

'కూచిపూడి నృత్య సంగీతం నవరస ఆధారితమైనది'


డీఎస్‌వీ శాస్త్రిని సన్మానిస్తున్న రాధా సారంగపాణి తదితరులు

సుల్తాన్‌బజార్: కూచిపూడి నృత్య సంగీతం నవరస ఆధారితమైనదని తెలుగు విశ్వవిద్యాలయం సంగీత విభాగాధిపతి డాక్టర్ రాధా సారంగపాణి అన్నారు. శనివారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్యనాటక సమితి వార్షికోత్సవాల్లో భాగంగా భారతీయ శాస్త్రీయ, సంగీత నృత్య పరిశోధాత్మక ప్రసంగ పరంపరలో భాగంగా కూచిపూడి నృత్య సంగీతంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాధా సారంగపాణి హాజరై ప్రసంగించారు. కూచిపూడి నృత్యం దేశ విదేశాలలో సైతం గుర్తింపు రావడం తెలుగువారికి గర్వకారణమన్నారు. ప్రసంగకర్త డీఎస్‌వీ శాస్త్రి కూచిపూడి నృత్య సంగీతంపై మాట్లాడుతూ.. కూచిపూడి నాట్య శైలిలో ఉన్న నాటకీయతను దృష్టిలో పెట్టుకుని సంగీతం కూర్పు చేసినప్పుడే జనరంజకంగా ఉంటుందన్నారు. గౌరవ అతిథి వసుంధర మాట్లాడుతూ.. నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవంలో భాగంగా నృత్య సంగీత గురువులకు, యువ కళాకారులకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌వీ శాస్త్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చలపతి, సుధామాల, రాజగోపాల చార్య, నవ్యనాటక సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్, శ్రీలత, డాక్టర్ ఇందిరాహేమ, స్నేహచందర్, రేణుకా ప్రభాకర్ పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన అంబటి శ్రీనివాస్



గోల్కొండ: సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని బీసీలు, అణగారిన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి హరీష్‌రావు అన్నారు. పద్మశాలి యువజన సంఘం తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ శనివారం మంత్రిని కలిశారు. పద్మశాలి భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలంతో పాటు నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతగా ఆయన మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు.

సీపీఎస్ రద్దు కోసం చొరవ చూపాలి


శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నరేందర్ రావు

సుల్తాన్‌బజార్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను కోరినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆయనను యూనియన్ తరఫున ఘనంగా సన్మానించారు. అనంతరం గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల వలే తెలంగాణలో సైతం సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సీపీఎస్ రద్దు కోసం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సత్యనారాయణ, వెంకటప్రసాద్‌గౌడ్, సుధాకర్, సీహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. శనివారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం చార్మినార్ మండల పరిధిలోని అర్హులైన పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న వర్షాకాలంలో వరదనీటి సమస్యలు తలెత్తకుండా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ పర్యటనలో తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, డబీర్‌పురా, మొఘల్‌పురా కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీయుద్దీన్, అలంధార్ వాలా జాహి, నస్రీన్ సుల్తానా, చార్మినార్ డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రతిరోజూ యోగా చేయాలి


యోగా మహోత్సవ్‌లో యోగా గురువులు సత్యనారాయణ, లత తదితరులు

అబిడ్స్: యోగా మహోత్సవ్‌లో భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం ఉదయం భారతీయ ఆయూష్ ఆధ్వర్యంలో యోగా మహోత్సవ్ వేడుకలు పరేడ్ గ్రౌండ్‌లో జోరుగా నిర్వహించారు. ఈ యోగా మహోత్సవ్ వేడుకల్లో నగరానికి చెందిన పబ్లిక్‌గార్డెన్, ఇందిరా పార్కులలో బీవైఎస్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా యోగా గురువులు సత్యనారాయణ, లత మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ కొంత సేపు అయినా యోగాసనాలు చేయాలన్నారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం తెచ్చే విధంగా యోగా మహోత్సవాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్, గ్రేటర్ బీజేపీ నాయకులు మహేష్ తివారి, బీవైఎస్ యోగా సభ్యులు కేత కుమార్, జయశ్రీ, జనార్దన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి



గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు, ప్రజలకు మధ్య ఆశా వర్కర్లు వారధిలాంటి వారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా నియమితులైన ఆశావర్కర్లకు నియామక పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి 2500 మంది జనాభాకు ఒక ఆశావర్కర్ అవసరమని, అయితే జనాభాకు సరిపడ ఆశా వర్కర్లు లేరని, సరైన వారిని గుర్తించి కార్వాన్ నియోజకవర్గంలోని 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొత్త ఆశా వర్కర్లను నియమిస్తున్నామని, కార్వాన్ క్లస్టర్ వైద్యాధికారిణి అనురాధా తెలిపారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా తదితరులున్నారు.

సుద్దాల అశోక్ తేజకు కిన్నెర-ఎన్టీఆర్ భాషా పురస్కారం


డాక్టర్ సుద్దాల అశోక్ తేజను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్–నృత్య కిన్నెర సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజకు కిన్నెర–ఎన్టీఆర్ భాషా పురస్కారం బహూకరణ శనివారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగింది. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అధ్యక్షతన సుద్దాల అశోక్ తేజకు కిన్నెర–ఎన్టీఆర్ భాషా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ దాసరి బాలయ్య, సినీ విజ్ఞాన విశారద ఎస్.వి.రామారావు, చీఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ రఘు, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.





అగ్ని ప్రమాదం.. ఉలిక్కిపడ్డ జనం



సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రూప్‌బజార్ ఎలక్ట్రికల్ మార్కెట్‌లో శనివారం చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అగ్ని ప్రమాదం పరిసరా ప్రాంతాల వ్యాపారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు 5 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. – సుల్తాన్‌బజార్

తరతరాలకు తరగని స్ఫూర్తి సురవరం ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: సురవరం ప్రతాప్‌రెడ్డి అనేక రంగాల్లో అసాధారణమైన కృషిని కొనసాగించి భావితరాలకు తరగని స్ఫూర్తిని అందించారని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శ్లాఘించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు 80 ఏళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సురవరం సాహిత్య సామాజిక రంగాల్లో అసాధారణమైన కృషిని అందించారని ఒక సాహిత్యానికే ఆయనను పరిమితం చేయడం తగదన్నారు. ప్రతాప్‌రెడ్డిని కేంద్రంగా చేసుకుని నూరేళ్ల తెలంగాణ పరిణామాలను ఇప్పటికే రెండు సంపుటాలుగా గ్రంథస్తం చేశామని, మూడవ సంపుటం త్వరలోనే రానుందన్నారు. ఇదంతా తన కష్టార్జితంతో చేస్తున్నదని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. సురవరం ప్రతాప్‌రెడ్డి, పరిషత్ స్థాపకుల్లో ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, కొండ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కార్ దవాఖానాలు

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


డయాలసిస్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: 'కార్పొరేట్'ను తలదన్నేలా సర్కార్ దవాఖానాలను మార్చుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో 5 పడకల డయాలసిస్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ ఏరియా ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలను మరింత పటిష్టం చేసి నాణ్యమైన వైద్య సేవలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడేవారు రోజురోజుకూ పెరిగిపోతున్నారని, ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్‌కు డబ్బులు చెల్లించుకోలేక ఎందరో మృత్యువాత పడుతున్నారని ఆయన అన్నారు. ఆరోగ్య మంత్రి హరీష్‌రావును కూడా ప్రత్యేకంగా కలిసి ఆస్పత్రి అభివృద్ధితో పాటు డయాలసిస్ విభాగాన్ని మంజూరు చేయాలని కోరామన్నారు. స్పందించిన ఆరోగ్య మంత్రి 5 పడకల సామర్థ్యం గల డయాలసిస్ విభాగాన్ని గోల్కొండ ఏరియా ఆస్పత్రికి మంజూరు చేశారన్నారు. ఆస్పత్రిలో అదనపు గదులు, అదనపు భవన నిర్మాణానికి సైతం నిధులు మంజూరు అయ్యాయని ఆయన అన్నారు. డయాలసిస్ విభాగానికి ఉస్మానియా ఆస్పత్రికి చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మనీషా ఏరియా ఆస్పత్రికి కన్సల్టెంట్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జయరామ్‌రెడ్డి, ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, ఏకే పఠాన్, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్, డాక్టర్ గోపాల్ తదితరులున్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి


నందకిశోర్ వ్యాస్‌కు హారతి ఇస్తున్న మహిళలు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. శనివారం గ్రేటర్ హైదరాబాద్ దళిత గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జాంబాగ్, రిసాలబుర్జుల్లా, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ధన్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, విజయ ముదిరాజ్, భజన్‌సింగ్, నరేష్‌యాదవ్, యోగేష్ యాదవ్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సరస్వతి పాల్గొన్నారు.

మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



అబిడ్స్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించాలని రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేరు కులస్తులకు అధిక సీట్లు ఇస్తే విజయం సాధిస్తామన్నారు. జనాభా ప్రాతిపాదికన మేరు కులస్తులకు న్యాయం చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం

అబిడ్స్: దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అబిడ్స్ చౌరస్తాలోని నెహ్రూ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్, ఇతర రాష్ట్ర నాయకులు నదీమ్ జావీద్, నరేష్‌కుమార్ గౌడ్, నిరంజన్, రఘునందన్ యాదవ్, ఫిరోజ్‌ఖాన్‌లు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏ–బ్లాక్ ఆధ్వర్యంలో..

గోషామహల్ నియోజకవర్గం–బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీకే మూర్తి ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీకే మూర్తి, అరవింద్‌కుమార్ యాదవ్, వెంకటేష్, శ్రీకాంత్ యాదవ్, సందీప్ నివాళులర్పించారు.

గౌలిపురాలో..

గౌలిపురా: జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయమని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. శనివాచం నెహ్రూ వర్ధంతిని లాల్‌దర్వాజా మోడ్ వద్ద నిర్వహించారు. వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేశ్ బాబు, శ్రీనివాస్, మూసా ఖాసిం, బాలాజీ పాల్గొన్నారు.


నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్


లాల్‌దర్వాజా మోడ్ వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్ తదితరులు